

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ వినతులను జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా మీకోసం.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అర్జీల నమోదు, ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100లో సంప్రదించాలన్నారు. అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని పేర్కొన్నారు.

రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి

అఖిలపక్ష కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి కేంద్రంగా 14 మండలాలను కలుపుకొని రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేసింది.ఆదివారం పట్టణం లోని ఎన్‌జిఒ హోమ్‌లో ఉదయం అఖిలపక్ష కమిటీ నాయకులు సమావేశమయ్యారు. అన్నమయ్య జిల్లా మూడుముక్కలైన తర్వాత రాయచోటికి జరిగిన అన్యాయం గురించి మాట్లాడారు. మూడున్నర సంవత్సరాలు పాటు జిల్లా కేంద్రంగా కొనసాగిన రాయచోటి భవిష్యత్తును ప్రభుత్వం ఎటూ కాకుండా అగమ్య గోచరంగా చేసిందని వాపోయారు. రాయచోటికి జరిగిన ఘోరమైన అన్యాయాన్ని సరిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. రాయచోటి లో ఇప్పటికే కలెక్టర్ కార్యాలయం, ఎస్‌పి బంగ్లాతోపాటు సుమారు 70 రకాల ఆఫీసులు ఏర్పాటు చేశారని చెప్పారు. వీటన్నిటి కోసం రూ. కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టిందని, జిల్లా కేంద్రం ఉందని భరోసాతో అన్ని వర్గాలు రంగాల ప్రజలు గ్రామాలలో ఆస్తులు సైతం అమ్ముకొని రాయచోటి కేంద్రంలో నివాసాలు, స్థలాలు కొనుగోలు చేశారని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలందరికీ కూడా తీరని అన్యాయం జరిగిందని అఖిలపక్ష కమిటీ అభిప్రాయపడింది. గత ఎన్నికల సందర్భంగా రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగిస్తామని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడంతో ప్రజలు నమ్మారని అన్నారు. రాయచోటి ప్రజల అభిప్రాయం తీసుకోకుండానే సుదూర ప్రాంతంలో ఉన్న మదనపల్లెలో రాయచోటిని విలీనం చేయడం వల్ల ఈ ప్రాంత వాసులకు ప్రభుత్వం తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దడానికి రాయచోటి కేంద్రానికి సమీపంలోనే ఉన్న కడప జిల్లాలోని సుండుపల్లి, వీరబల్లి, చక్రాయపేట, మదనపల్లి జిల్లాలోని కె.వి. పల్లి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, అనంతపురం, జిల్లాలోని ఎన్.పి కుంట మండలాల తోపాటు రాయచోటి నియోజకవర్గం లోని గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాల తోపాటు 14 మండలాలను రాయచోటి కేంద్రంతో ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మండలాలన్నీ కూడా రాయచోటికి కేవలం 30 కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్నాయని ఈ మండలాల ప్రజలందరూ కూడా అన్ని రకాల పనులకు ఇతర అవసరాలకు రాయచోటిని ఆశ్రయిస్తుంటారని భౌగోళికంగా కూడా శేషాచల అటవీ ప్రాంతానికి పడమటి ప్రాంతానికి ఈ మండలాలు చెందుతాయని వారన్నారు. సమావేశంలో భారత న్యాయవాదుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఒపిటిఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి ఈశ్వర్, ఎంఆర్‌పిఎస్ రామాంజనేయులు, లోక్‌సత్తా గిరిబాబు యాదవ్, ఎఐఎస్ఎఫ్ కోటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ విశ్వనాథ్, రజక సంఘం శ్రీనివాసులు, రమేష్, రమణ , ఎంఐఎం పార్టీ ఎం ఖాదర్ బాషా,కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నై కృష్ణ, లంబాడి సంఘం శంకర్ నాయక్, ఎస్‌టియు నాయకులు వై .విశ్వనాథరెడ్డి, హెచ్ఎం అసోసియేషన్ నాయకులు రెడ్డి అప్ప రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మన్సూర్ అలీ ఖాన్ ఎం. వెంకటరమ జనసేన పార్టీ రియాజ్, ఎలక్ట్రికల్ అసోసియేషన్ అస్లాం, సహారా వెల్ఫేర్ అసోసియేషన్ అఫ్తాబ్, ఐఎఎల్ న్యాయవాదులు డి.నాగమణి, నిరంజన్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు యుగంధర్, కె విక్రమ్ , ఆర్. అమీర్‌బాషా బహుజన రక్షణ సమితి నాయకులునాగార్జున, ఉపాధ్యాయులు రెడ్డన్న, ఎస్ జనార్ధన్ రాజు పాల్గొన్నారు



మాట్లాడుతున్న అఖిల పక్ష నాయకులు

రేపు ఉద్యమ కార్యాచరణ సమావేశం

ఈనెల 6న ఉదయం 10 గంటలకు పట్టణ ప్రముఖులతో పాటు అఖిలపక్ష కమిటీ నాయకులను రాయచోటి అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద సమావేశపరిచి 14 మండలాలతో కలిపి రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అఖిలపక్ష కమిటీ నాయకులు తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌పి ధీరజ్

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి అప్ గ్రేడ్ పోలీసు స్టేషన్ ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన అనంతరం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి, గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలను కాపాడటానికి పలు ఆదే శాలు జారీ చేశారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కలికిరిలో ఐటిబిపి, సి ఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, సైనిక్‌స్కూల్, జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రతిష్టాత్మక సంస్థలు ఉన్నందున, పోలీస్ వ్యవస్థ ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ అధికారులు ప్రతి రోజు గ్రామాల సందర్శనను విధిగా పాటించాలని, రాత్రి బీట్‌లో మండలం అంతా కవర్ అయ్యేలా పర్యవేక్షణ ఉండాలని, సామాజిక నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఓపెన్ డ్రింకింగ్, పేకాట, కోడిపందాలు, మైనర్ డ్రైవింగ్ వంటి సమాజ వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్ ఆక్సిడెంట్ల నివారణకు ప్రజలు ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించాలని, అట్ల ధరించకుండా ఉల్లంఘన చేసే వారిపై భారి జరిమానాలు, మైనర్‌లకు డ్రైవింగ్ ఇచ్చే తల్లిదం డ్రులపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రజలకు తక్షణ సేవ కోసం ఫిర్యాదు దారులతో గౌరవంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను తక్షణమే పరిశీలించి, చట్ట పరిధిలో బాధితు లకు న్యాయం చేయాలని, మహిళా పోలీసులు మరియు శక్తి టీంతో కలిసి, మహిళలపై జరిగే నేరాల గురించి, మాదకద్రవ్యాలు, సైబర్ మోసాలు వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల అమరికపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి పోలీస్ అధికారి ప్రజల భద్రత పట్ల పూర్తి నిబద్ధతతో పనిచేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడిన ఎస్‌పి విధులు సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు, వ్యక్తిగత ఆరోగ్యం, కుటుం బం, పిల్లల భవిష్యత్తు పై కూడా శ్రద్ధ వహించాలన్నారు. సిబ్బందిలో ఆత్మ విశ్వాసం పెంచుతూ విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేసే వారికి రివార్డులు అంది స్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐ కె.రామచంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సిఎంతో లోపాయికారీ ఒప్పందం: నిస్సార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాటి ఓటుకు నోటు నుంచి నేటి రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు మధ్య అంతా రహస్యమే, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయడం ద్వారా రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆరోపించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా సిఎం రేవంత్ రెడ్డి మాటలతో చంద్రబాబునాయుడు మధ్య ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతమయిందన్నారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ కేవలం స్వప్రయోజనాల కోసమే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు తిలోదకాలు ఇచ్చారని మండిపడ్డారు. స్వప్రయోజనాల కోసమే పర్యావరణ అనుమతులు లేవన్న సాకుతో రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు నిలిపివేశాడని స్పష్టం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతిసారీ ఎపికి నీటి గండమేనని విమర్శించారు. తక్షణమే రాయలసీమ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమను ఎడారిగా మార్చే కుట్ర నుంచి రాయలసీమ ప్రాంతంలోని కూటమి ప్రజాప్రతినిధులు బహిరంగంగా వ్యతిరేకించాలని కోరారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని తెలిపారు. చంద్రబాబునాయుడు సీఎం అయ్యాక రేవంత్ రెడ్డితో మాట్లాడి ప్రాజెక్టును నిలుపుదల చేయించినట్టు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆ రాష్ట్ర అసెంబ్లీలో కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడటమే ఇందుకు నిదర్శనమన్నారు.శ్రీశైలం జలాశయం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల ఉమ్మడి ప్రాజెక్టు అని సీమ ప్రాజెక్టులకు సాగు నీరివ్వడం కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ 841 అడుగుల ఎత్తులో అమర్చారన్నారు. శ్రీశైలంలో 880 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో నీరు నిల్వ ఉన్నప్పుడే, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం ఉంటుందన్నారు. 854 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 7 వేలు, 841 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 2 వేల క్యూసెక్కులు మాత్రమే తరలించే అవకాశం ఉంటుందన్నారు. శ్రీశైలంలో 841 అడుగుల కంటే దిగువన నీటి మట్టం ఉంటే చుక్కనీటిని కూడా తీసుకోలేమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి అనుమతి తీసుకోకుండా 2015 లో కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు శ్రీశైలం నుంచి రోజుకు 2 టిఎంసిలు తరలించేలా పాలమూరు - రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలను చేపట్టినా నాటి చంద్రబాబు సర్కార్ అడ్డుకోలేదని ఆరోపించారు. సమావేశంలో సీనియర్ నాయకురాలు షమీమ్ అస్లాం, బీరంగి రేవతి, నాగమణి, వినుతాభాయి, కౌన్సిలర్లు ప్రసాద్ బాబు, ఈశ్వర్ నాయక్, శ్రీనివాసులు, మాజీ సైనికులు మల్లికార్జునరెడ్డి, మహేష్ బాబు, నరసింహులు నాయుడు, పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్

రహదారి భద్రతా నియమాలు పాటించాలి: ఆర్‌టిఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌టిఒ


వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని మద నపల్లె ఆర్‌టిఒ అశోక్ ప్రతాప్‌రావు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2026ని పురస్కరించుకొని ఆదివారం మదనపల్లె ఎంవిఐ, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్లు, సిబ్బంది కలిసి పట్టణంలోని అమ్మచెరువుమిట్ట రింగ్ రోడ్డులో రాంగ్ డైరెక్షన్ వాహనాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఒ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైట్ మోటార్ వాహన డ్రైవర్లు సీటు బెల్టు ధరించాల్సిన ప్రాముఖ్యత గురించి రహదారి వినియోగదారులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కర పత్రాలు పంపిణీ చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటిం చాలని, తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంవిఐలు, ఆర్‌టిఒ కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

11న ధన్యవాద్ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎపిలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని, దశాబ్దాల కల అయినటువంటి మదనపల్లి జిల్లా హామీని అమలు చేయడమే ఇందుకు నిదర్శనమని ఎపిఐఐసి డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ మైఫోర్స్ మహేష్ పేర్కొన్నారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లి జిల్లా కలను నిజం చేసిన కూటమి ప్రభుత్వానికి, సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేసేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 11న ధన్యవాద్ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం మదనపల్లి జిల్లాను ఏర్పాటు చేయకపోవడంతో సుమారు 600 రోజులకు పైగా మదనపల్లె జిల్లా కేంద్రంగా చేయాలని ఉద్యమం జరిగిందన్నారు. పట్టించుకోని ఆనాటి వైసిపి ప్రభుత్వం జిల్లా కోసం పోరాడిన ప్రతి ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టిందన్నారు. మదనపల్లి జిల్లా వాసులుగా ధన్యవాదాలు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు అమర నారాయణ, నాయకులు సందీప్ రెడ్డి, రమణారెడ్డి, చిరంజీవి, రాజా, మనోజ్, నరేష్, నాగేంద్ర జనసేన పార్టీ మహిళ నాయకురాలు శోభ, సునీత పాల్గొన్నారు.

కొండెక్కిన కోడి



- కిలో చికెన్ రూ.290
- త్వరలో కిలో స్కిన్‌లెస్ రూ.360?
- హేచరీస్ హాలిడేస్ కారణమా!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

చికెన్ ధర చుక్కలను తాకుతోంది. నెలన్నర వ్యవధిలో కిలో చికెన్ రూ. 180నుంచి రూ.290 పెరగడం చికెన్ ప్రియులకు చికాకు పరుస్తోంది. చికెన్‌తోపాటు కోడిగుడ్డు సైతం రూ.5 దాటుకుని రూ.7నుంచి రూ.8 వరకు పలుకుతోంది. రోజురోజుకూ చికెన్, గుడ్లు, కూరగాయల ధరలు పెరుగుదల్లో పరస్పరం పోటీపడుతున్నాయి. దీనికి గల కారణాలను పరిశీలిస్తే కోళ్ల హేచరీస్‌కు హాలిడేస్ ఇవ్వడం, చికెన్ చిక్స్‌లో సమస్య తలెత్తడంతో ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా చికెన్ ధర భారీగా పెరిగినట్లు ఆయా మార్కెట్ వర్గాల చెబుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో శాఖాహారం వైపు చూస్తే ధరాఘాతం దెబ్బకు సామాన్యుడు కుదేలవుతున్నాడు. చికెన్ ధరలతో పప్పు దినుసులు, కూరగాయల ధరలు సమానంగా పెరుగుతుండడంతో సామాన్యులకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి కడప జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, రాజంపేట ప్రాంతాలను మినహాయిస్తే కోళ్లఫారాల నిర్వహణ అంతంతమాత్రమే. ఇటీవల ముగిసిన కార్తీకమాసం నేపథ్యంలో మాంసాహారులు చికెన్ వైపు పెద్ద ఎత్తున మరలడంతో వినియోగం పెరిగింది. ఆ మేరకు సప్లయ్ - డిమాండ్ల చైన్ల మధ్య సమతుల్యత లోపించడమే ధర పెరుగుదలకు కారణమని తెలుస్తోంది. జిల్లాలో చికెన్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో మదనపల్లి, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఐడి, వైఆర్ఎస్, షాలీమార్, వెంకోబ్ వంటి సంస్థల నుంచి వ్యాపారులు కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ ఏడాది కోళ్ల హ్యాచరీస్ హాలిడేలో ఆలస్యం కావడం, చికెన్ చిక్స్ సేకరణలో నిర్లక్ష్యం కారణంగా డిమాండ్ పెరుగు దలకు కారణమని తెలుస్తోంది. ఫలితంగా డిమాండ్ మేరకు కోళ్ల ఉత్పత్తి కొర వడింది.

ఇటీవల కార్తీక మాసం, జనవరి ఫస్ట్, జనవరి 14న సంక్రాంతి పండుగలు వరుసగా రావడం తెలిసిందే. పండుగల అవసరాల నేపథ్యంలో గ్రామీణ, పట్టణ అవసరాలకు సరిపడా కోళ్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీంతో ఆనతికాలంలోనే రూ.320 నుంచి రూ.360 వరకు కిలో స్కిన్‌లెస్ ధర పెరిగే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ వర్గాల అంచనా. నాటు కోడి మాంసాన్ని కొనుగోలు చేద్దామనుకుంటే నాటుకోడి చికెన్ కిలో కనిష్టంగా రూ.750 నుంచి రూ.1000 వరకు పలుకుతోంది. దీంతో పల్లె సీమల ప్రజలు సైతం బాయిలర్ కోళ్ల మాంసంపైనే అధికంగా ఆధార పడుతున్నారు.

చికెన్ ధరలకు ధీటుగా పండుగల నేపథ్యంలో కూరగాయల, పప్పు దినుసుల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఇందులోభాగంగా టమోటా, పచ్చిమిర్చి, బీట్‌రూట్, క్యారెట్ రూ.40 నుంచి రూ.55 వరకు కాయ గూరలు ధరలు పలుకుతుండడం సామాన్యుడికి విస్మయాన్ని కలిగిస్తోంది. కిలో కందిపప్పు సుమారు రూ.120 వరకు పలుకుతోంది. మాంసా హారంతోపాటు మేము సైతం అనేలా కూరగాయలు, పప్పుదినుసుల ధర లు పోటీపడుతున్న నేపథ్యంలో సామాన్యునికి పౌష్టికాహారం అందని పరి స్థితి నెలకొంది.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

డిఎంహెచ్ఒ లక్ష్మీనరసయ్య

ప్రజాశక్తి - రాయచోటి





స్క్రబ్ టైఫస్ పై ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల పొలాలలో పేడలో ఉండే చిగ్గర్ చిన్న పురుగు కుట్టడం వల్ల స్క్రబ్ టైఫస్ వ్యాధి వ్యాపిస్తుంది. దీనిపైన ప్రజలు ప్రతి ఒక్కరూఅవగాహన కలిగి ఉండాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఈ వ్యాధిని అరికట్టవచ్చు. స్క్రబ్ టైఫ స్ వ్యాధిని రాకుండా ఉండేందుకు ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

స్క్రబ్ టైఫస్ అంటే ఏమిటి?

స్క్రబ్ టైపస్ ఒక్క చిగ్గర్ అనే పురుగు కాటు వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఇది ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో పశువులు, పొలాలు, గడ్డి వాముల, ఎలుకల వల్ల, మురుగునీరు ఉండే ప్రాంతాలలో నాలుగు కాళ్లతో కూడిన నల్లి పోలికతో పురుగు ఉంటుంది. ఈ పురుగు కుట్టడం వల్ల స్క్రబ్ టైఫస్ వస్తుంది.

స్క్రబ్ టైఫస్ కేసులు జిల్లాల్లో ఎన్ని నమోదు అయ్యాయి?

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 47 స్క్రబ్ టైపస్ వ్యాధి కేసులు నమోదయ్యాయి. వివిధ ప్రాంతాలకు చెందిన వారు మెడికల్ కళాశాలలు, ఇతర రాష్ట్రాలలో టెస్టింగ్‌లలో బయటపడినవి ఈ వ్యాధి.ఈ వ్యాధిని సోకిన వారు అందరూ ఆరోగ్యంగా ఉన్నారు. ఇప్పటివరకు ఎలాంటి మరణాలు లేవు.

లక్షణాలను ఎలా గుర్తించాలి?

చలి, అధిక జ్వరం, దగ్గు, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు, తలనొప్పి, చర్మంపై దద్దుర్లు, అలసట ఉంటుంది. ఈ పురుగు కుడితే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ వస్తుంది. కొద్దిమందిలో మొదట ఎర్రని పుండు ఏర్పడి, క్రమేణ మాడిపోయినట్లు నల్ల రంగులోకి మారి నొప్పి కూడా ఉండదు. ఈ లక్ష ణాలు కనిపించడానికి దాదాపు పది రోజుల సమయం పడుతుంది. తీవ్ర చలి, జ్వరం, తలనొప్పి, పొడి దగ్గు, కండరాల నొప్పులు, దద్దుర్లు, వాంతులు, వికారం, కడుపునొప్పి వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి.

ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. శారీరిక శుభ్రత పాటించాలి. ఈ వ్యాధి సోకే ప్రాంతాలలోకి వెళ్లకూడదు. ఇంట్లో పాత పరుపులు, దిండ్లు, దుప్పట్లు తీసివేయాలి. చిన్నపిల్లలు, పెద్దలు పూర్తిగా శరీరం కప్పే విధంగా బట్టలు ధరించాలి. వృద్ధులు, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వారిలలో బ్యాక్టీరియా మెదడుకు వ్యాపించడం, నిమోనియా ఊపిరితిత్తులు సకాలంలో చికిత్స చేయకపోతే 3 శాతం నుంచి 4 శాతం కేసులలో శరీరంలోని అవయవాలు పని చేయకపోవుట ముఖ్యంగా కాలేయం, మూత్ర పిండాలతో సహా అవయవాలను ప్రభావితం చేస్తుంది. అనుమానిత లక్షణాలను ఉంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. మదనపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డిపిహెచ్ఎల్ విభాగంలో స్క్రబ్ టైపస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయబడును.

నివారణకుఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

స్క్రబ్ టైపస్ వ్యాధి పట కలెక్టర్ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించి పలు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

ప్రజలకు సలహాలు సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఔషధాలను రోగ తీవ్రత లక్షణాల మేరకు క్వాలిఫైడ్ వైద్య నిపుణుల సూచనలను, సలహాలను పాటిస్తూ వారి పర్యవేక్షణలో వినియోగించాలి. సొంతంగా నిర్ణయాలు తీసుకోవద్దు. స్క్రబ్ టైపస్ వ్యాధి అంటువ్యాధి కాదు. కావున జిల్లాలోని ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.



లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి అర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన ఆశాజ్యోతి, బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ అని ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలి 217 జయంతి వేడుకలను విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఆదివారం మదనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ లిపి ద్వారా అంధులు విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారన్నారు. విద్య ద్వారా లోకాన్ని చూడగలగుతున్నారని వివరిం చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి, కొత్తవారిపల్లె జడ్‌వి హెచ్ఎస్ హెచ్ఎం మోహన్, కొత్త ఇండ్లు పాఠశాల ఉపాధ్యాయుడు గురుప్రసాద్, మానవత అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, వెంకటరమణ రెడ్డి, నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు కృష్ణమూర్తి, టీచర్ మంజుల, పాలిటెక్నిక్ కాలేజ్ సీనియర్ అసిస్టెంట్ నాగమణి, కృష్ణప్ప, ఐడిబిఐ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్, బీసీ వెల్ఫేర్ కరుణాకర్, భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు నాగేంద్ర, రెడ్డెమ్మ, రామచంద్ర పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమం ద్వారా విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు



డాక్టరేట్ తీసుకుంటున్న ఆయేషా

ఆయేషాషెరీఫ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా కేంద్రం మదనపల్లెకు చెందిన ఆయేషా షెరీఫ్ అనంతపురం జెఎన్‌టియు నుంచి బయోటెక్నాలజీలో పిహెచ్‌డి పట్టాను విజ యవంతంగా అందు కున్నారు. ఆమె సమర్పించిన పరిశోధనా పత్రం స్టడీ అండ్ అనాలిసిస్ అఫ్ బయోగ్యాస్ ప్రొడక్షన్ యూసింగ్ రహెూడోప్సెడొమోనస్ ఫేకలీస్ ఇన్ ఆన్ అనారోబిక్ డైజెస్టర్ పునరుత్పాదక ఇంధనం, వ్యర్థాల నిర్వహణ రంగంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది. అలీప్ ఇండస్ట్రియల్ పార్క్, మురుగునీటి శుద్ధి ప్లాంట్ నుండి ఒక కొత్త సూక్ష్మజీవిని గుర్తించిన ఆయేషా దాని ద్వారా క్యాంటీన్ వ్యర్థాల నుండి బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచే విధానాన్ని కనుగొన్నారు.ఆమె పరిశోధనలో మైక్రోబయాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్, రియాక్టర్ డిజైన్ వంటి అంశాలు మిళితమై ఉన్నాయి. కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆమె కోహినూర్ ఇండస్ట్రీస్ అనే స్టార్టప్‌ను స్థాపించి, పర్యావరణహిత ప్యాకేజింగ్ పరిష్కారాలపై దృష్టి సారించారు. ప్రస్తుతం ఈ సంస్థ ఎపిసి అలీప్ వెహబ్ ఎంఎస్ఎంఇ ఇంక్యుబేటరులో ఉంది. ఈ పరిశోధన డాక్టర్ ఎం. మొహిబ్బే ఆజం, ప్రొఫెసర్ కె.శేషమహేశ్వరమ్మ పర్యవేక్షణలో జరిగింది. ఆమెకు ఐఐసిటి, జెఎన్‌టియుహెచ్, సిప్రా ల్యాబ్స్ నిపుణుల నుంచి శిక్షణ లభిం చింది. అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆమె రాసిన నాలుగు వ్యాసాలు ప్రచురిత మయ్యాయి. ఆయేషాషెరీఫ్ తన కుటుంబంలో పిహెచ్‌డి సాధించిన మొదటి వ్యక్తి. తన ఈ విజయాన్ని తండ్రి షెరీఫ్ అహమ్మద్, తన భర్త డాక్టర్ జహూరుల్లా కు అంకితమిస్తున్నట్లు తెలిపారు.ఆయేషాను పట్టణంలోని విద్యావేత్తలు, ప్రముఖులు అభినందించారు.

ఎస్‌పి కార్యాలయ ఏర్పాట్లు పరిశీలించిన డిఐజి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎస్‌పి కార్యాలయ భవనాన్ని కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ ఆదివారం పరిశీలించారు. కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలోకి వచ్చిన పుంగనూరు, చౌడేపల్లి పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన తిరుగు ప్రయాణంలో మదనపల్లెకు విచ్చేశారు. డిఎస్‌పి కార్యాలయాన్ని, నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎస్‌పి కార్యాలయ భవనాన్ని, బీటీ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎస్ పి ధీరజ్ కునుబల్లి, డిఎస్‌పి మహేంద్ర, సిఐలున్నారు.



సన్మానం అందుకుంటున్న గంగనపల్లి వెంకటరమణ

'గంగనపల్లి'కి సన్మానం

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలాలికల జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ ఆదివారం కడపలో ఘన సత్కారం అందుకున్నారు. కడప జిల్లాకు చెందిన మహాకవి కీ.శే. వైసివిరెడ్డి శత జయంతి వేడుకల సందర్భంగా సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం వైసివి రెడ్డి శత జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.వైసివి. రెడ్డి సమగ్ర సాహిత్యంలోని 'మేనక'అనే పద్యకావ్యంపై గంగనపల్లి వెంకట రమణ పరిశోధనాత్మక వ్యాసం రాశారు. వంద వసంతాల వైసివి అనే పేరుతో నిర్వహించిన ఈ సభలో గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి రెడ్డి కుమారులు ప్రతాపరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ పురుషోత్తమ రెడ్డి, సిపి బ్రౌన్ గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, వైసివి రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సాహితీవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని అన్ని పంచాయతీలలో 5వ తేదీన ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని కడప జిల్లా డిపిఒ రాజ్యలక్ష్మ ఆదేశాలు జారీ చేశారని ఎంపిడిఒ జవహర్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ జ్యోతీశ్వరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ కమీషనర్ గ్రామీణభివృద్ధిశాఖ ఉత్తర్వుల అనుసరించి మండలంలోని అన్నీ గ్రామపంచాయతీలలో స్వచ్ఛ సంక్రాతి - స్వచ్ఛ గ్రామపంచాయతీ 2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5 న ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.జిల్లా లో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన మూడు గ్రామ పంచాయతీలను గురించి, గ్రామం పెద్దలను ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలలో సత్కరించునున్నట్లు తెలిపారు. చెత్తరహిత గ్రామపంచాయతీ అనే అంశం ప్రధాన అజెండాతో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛతను నిరంతరం కొనసాగించేందుకు తీర్మానాలు ఆమోదిస్తారని గ్రామసభలో పాల్గొనాలని వారు కోరారు.

ఆలయ అభివృద్ధికి రూ. 25వేలు విరాళం

ప్రజాశక్తి:గుర్రంకొండ

మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో రెడ్డమ్మ దేవత దేవస్థాన ఆలయ అభివృద్ధి పనులకు అచిన్నమండెం మండలం, ముళ్ళవారికోటకు చెందిన చింతమాని రమణమ్మ, లక్ష్మయ్య దంపతులు రూ.25వేలు విరాళంగా అందించారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం దాతలచే అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వాయల్పాడులో ఆలయ ఖాతాకు జమ చేయడం జరుగుతుందని ఇఒ మంజుల తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఆలయ చైర్మన్ శ్రీలంకి పల్లి రాజన్న నాయుడు, ఇఒ ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తాం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

దేశ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని,రాష్ట్రంలో దాదాపు 40 లక్షల ఎకరాల మిగులు భూములు గ్రామీణ పేదలకు భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ పోరాట సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి రెడ్డి ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో కోటి ఎకరాలకు పైబడి ఖాళీగా ఉన్న మిగులు పేదలకు పంపిణీ చేయాలని హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర పెద్ద ఎత్తున ఎనిమిది రోజులు ఆమరణ దీక్షలు చేపట్టారని తెలిపారు.భూ పోరాటాలు ఆందోళనలు సందర్భంగా ముగ్గురు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పోలీసులు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. .సామాజిక న్యాయం కావాలంటే విద్య,వైద్యం,ఉద్యోగాలలో వాటా కావాలని తెలిపారు. ప్రాజెక్టులు, పరిశ్రమలు కోసం భూములు తీసుకుంటున్న రైతులకు ప్రత్యామ్నాయంగా భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచ లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేశవరెడ్డి,కదిరప్ప పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి :సిఐ

ప్రజాశక్తి-చిన్నమండెం

యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని సిఐ రోషన్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రం చిన్నమండెంలోని మల్లూరు క్రాస్ వద్ద గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. గ్రామాల్లో విద్వేషాలు పెంచుకోకుండా అందరూ శాంతియుతంగా జీవించాలని చెప్పారు. యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని దాని వల్ల జీవితం నాశనమవుతుందన్నారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఒక్కొక్క గ్రామ పంచాయతీలు ఒక పోలీస్ నియమించడం జరుగుతుందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామాల్లో 12 గంటల తర్వాత కోళ్ల దొంగతనాలు, మోటార్ల వద్ద వైర్లు కత్తిరింపులు లాంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. వాటిని నివారించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి, నీరోలంక, శ్రీనివాసపురం, శ్రీరాంనగర్ కాలనీ రోడ్డు, వారకురోపల్లె గ్రామ ప్రజలు, ఏఎస్ఐ రఘురామయ్య, హెడ్ కానిస్టేబుల్ రవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడంపై అవగాహన

ప్రజాశక్తి-రాయచోటి

ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ మార్గదర్శకత్వంలో రాయచోటి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్ ధరించడంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ కుళాయప్ప మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వాడకం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఎస్ఐ జహీర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి కృష్ణమోహన్

వరుస దొంగతనాలతో.. బెంబేలెత్తుతున్న అనంతంపల్లె ప్రజలు

- తాళాలు వేసిన గృహాలే వారి టార్గెట్
- ఈ మధ్య కాలంలోనే 14 ఇళ్లల్లో చోరీ
- నిద్రలేమి రాత్రులు గడుపుతున్న గ్రామ ప్రజలు
- రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచాలని వేడుకోలు



ఇంటిలో సామగ్రిని చల్లాచెదరు చేసిన దుండగులు(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎన్నో ఏళ్లుగా మూతపడిన ఇళ్లల్లో ఏమీ ఉండదని తెలిసినా ఆ ఇళ్లను సైతం తలుపులు పగులగొట్టి ఇంట్లో వస్తువులు చిందర వందర చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఘటన మండల పరిధిలోని అనతంపల్లిలో చోటు చేసుకుంది. గత నెల రోజుల నుంచి దొంగతనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రతిరోజు ఏదో ఒక ఇంట్లో దొంగలు పడి తలుపులు, కిటికీలు, బీరువాలు పగలగొట్టి బంగారు, డబ్బులు లేకపోయినా ఇంట్లో వస్తువులను చిందరవందర చేసి మరీ వెళుతున్నారని గ్రామస్థులు తెలుపుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. ఇంటికి తాళం వేశారంటే దొంగలు పడినట్లే అని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తాళాలు వేసిన గృహాలే లక్ష్యంగా దొంగలు బీభత్సం చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇంటిలో నగలు, నగదు పోకపోయినప్పటికీ తలుపులు, కిటికీలు, బీరువాలు పగలగొట్టి ఇంటిని చిందర వందర చేయడం వలన అవి బాగు చేసుకోవడానికి ఇంటి యజమానికి వేళల్లో ఖర్చు వస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రికి వెళ్లినా కూడా రోగి పరిస్థితి ఎంత విషమంగా ఉన్నా ఇంటిని కనిపెట్టుకొని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. గత కొన్ని నెలలుగా ఈ వ్యవహారం అనంతంపల్లి గ్రామంలోనే జరగటం విచిత్రంగా భావిస్తున్నారు. అసలు ఈ గ్రామానికి ఏమైందని వారికి వారే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి సమయాల్లో అనంతం పల్లి గ్రామంలో గస్తీ నిర్వహించి దొంగలను పట్టుకుని తగిన బుద్ధి చెప్పాలని గ్రామ ప్రజలు వేడుకొంటున్నారు.

గతంలో ఎన్నడూ ఈ విధంగా లేదు

నా వయసు 75 సంవత్సరాలు. ఇన్ని రోజులుగా నేను ఊర్లో నివాసం ఉంటున్నాను. గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి దొంగతనాలు లేవు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహిస్తే బాగుంటుంది. వయసు పైబడిన మేము రాత్రి వేళల్లో ఇళ్లలో నిద్రించాలంటే భయం వేస్తుంది.

-నారపురెడ్డి అచ్యుత్ రెడ్డి, అనంతంపల్లె


ఇంటిని కనిపెట్టుకొని ఉండాల్సిందే



నాకు ఆరోగ్యం సరిలేక ఆస్పత్రికి వెళ్లినా కూడా రాత్రి సమయానికి ఇంటికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలా రాని యెడల పొద్దున కల్లా ఇంటి తలుపులు పగలగొడుతున్నారని భయం గ్రామంలో ఎక్కువగా ఉంది. పోలీసులు గస్తీ పెంచాలి.

- పోలి మహేష్ రెడ్డి,ఉపాధ్యాయుడు

గ్రామంలో విచారిస్తాం



వరుస దొంగతనాలు ఘటన మత దృష్టికి రాలేదు. నేను వచ్చి రెండు నెలలు కూడా కాలేదు. కాబట్టి దొంగతనాలు గురించి విచారించి అనంతంపల్లి గ్రామంలో గస్తీ నిర్వహించడానికి తగు చర్యలు తీసుకుంటాం.

-చిన్న రెడ్డప్ప, ఎస్ఐ పుల్లంపేట

రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం :'కొరముట్ల'



సమావేశంలో మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాబోయే సాధారణ ఎన్నికల్లో వైసిపి విజయం సాధిస్తుందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో గ్రామ స్థాయి,మండల స్థాయి, నియోజకవర్గం స్థాయి కమిటీల నిర్మాణాలపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే అకేపాటి అమర్నాథ్ రెడ్డి, పరిశీలకులు వజ్ర భాస్కర్ రెడ్డి, దేవనాద్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా కొరముట్ల మట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో వ్యతిరేకత ఏర్పడిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ లను అమలు చేయకుండా కక్ష సాధింపు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఓబులవారిపల్లి మండల కన్వీనర్ సాయి కిషోర్‌రెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, పెనగలూరు మండల కన్వీనర్ చక్రపాణి, ముస్తాక్, సీనియర్ నాయకుల దుర్గా నాగేంద్రయాదవ్, వెంకట్‌రెడ్డి, పంజం వేణుగోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ శివసాయి, జడ్‌పిటిసి రత్నమ్మ, సిహెచ్ రమేష్, నాగేంద్ర, కృష్ణారెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, సర్పంచులు వార్డు మెంబర్లు ఎంపి టిసిలు, ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సిఎం ధ్యేయం :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట

అభివృద్ధి, సంక్షేమమే సిఎం చంద్రబాబు ధ్యేయమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని చెప్పారు. విద్యుత్ వ్యవస్థలో అనిశ్చితి, ఆర్థిక దోపిడీ, గందరగోళం ఏర్పడిందన్నారు. విద్యుత్ అనేది ప్రభుత్వానికి అస్త్రం కాదని, ప్రజల జీవితాలతో ముడిపడిన అత్యంత కీలక మౌలిక రంగమని, అలాంటి విద్యుత్ వ్యవస్థను వై.ఎస్.జగన్ మూర్ఖపు ఆలోచనలతో నిర్వీర్యం చేశారన్నారు. 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి దాదాపు రూ.32వేల కోట్లు ప్రజలపై భారం మోపిందని ఆరోపించారు. ఆక్వా రైతులకు యూనిట్ రూ.3.50 వసూలు చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రూ 1.50 తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ట్రూ ఆఫ్ చార్జీలు 13 పైసలు తగ్గించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మండల పార్టీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్.కే కరీమ్, వీరబల్లి మండల అధ్యక్షులు భానుగోపాలరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు, పట్టణ క్లస్టర్ ఇంచార్జి కొల్లి రెడ్డయ్య నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యుటిఎఫ్ మదనపల్లె డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఉన్న ఒక ఫంక్షన్ హాల్ లో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డివిజన్ లోని 11 మండలాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 40 మంది మహిళా ఉపాధ్యాయులను శాలువా, పుష్పగుచ్ఛం, మెమెంటులతో సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన రామసముద్రం మండల విద్యాధికారిని హేమలత మాట్లాడుతూ మహిళలు ఉన్నతంగా చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారంటే దానికి కారణం సావిత్రిబాయి పూలే తెలి పారు. నిమ్మనపల్లి ఎంఇఒ పద్మావతి మాట్లాడుతూ సంకల్పబలం ఉంటే ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొని పరిష్కరించుకుంటామని సావిత్రిబాయి పూలే నిరూపించారన్నారు. బాలికల విద్య కోసం ప్రయత్నిస్తున్నప్పుడు ఎన్నో అవమానాలను అవరోధాలను ఎదుర్కొన్న సావిత్రీబాయిపూలే తన లక్ష్యసాధన కోసం వెనకడుగు వేయలేదని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హేమలత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించడంలో పురుషుల పాత్ర కూడా మరువలేనిదని, నిరక్షరాస్యురాలైన సావిత్రిబాయిని అక్షరాస్యురాలిగా మార్చడం, బాలికల విద్య కొరకు పాఠశాలలను ఏర్పాటు చేయడం లో ఆమె భర్త జ్యోతిరావుపూలే సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.చంద్రశేఖర్, సహా అధ్యక్షులు శ్రీలత, రవిప్రకాష్, జిల్లా కోశాధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, విజయ్ కుమార్, ఆనంద రెడ్డి, పురం ఆదినారాయణ, డివిజనల్ కన్వీనర్ సుధాకర్, వివిధ మండలాల నుండి వచ్చిన యూటిఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మిట్స్'లో అశ్వ్-2026 పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లి సమీపంలోని మిట్స్ యూనివర్సిటిలో అశ్వ్ 2026 - జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ వెబ్ సైట్ , ప్రమోషనల్ పోస్టర్‌లను యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ నాదెళ్ల విజయ భాస్కర్‌చౌదరి ఆదివారం ఆవిష్కరించారు. ప్రతి యేటా యూనివర్సిటీలో నిర్వహించే ఈ ఫెస్ట్‌లో విద్యార్థులకు వివిధ పోటీలను టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ విభాగాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యేడాది మార్చి 25, 26వ తేదీలలో రెండు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహిస్తామనివిసి డాక్టర్ సి. యువరాజ్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో డిప్లొమా, ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని, వివరాలు యూనివర్సిటీ అశ్వ్ వెబ్ సైట్ www.ashv2k.in, www.mits.ac.inలో పొందు పరిచామన్నారు. ఈ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు పోటీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని, ఈ కార్యక్రమం లో ప్రతి ఏటా సినీ ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అలరిస్తారని, ఈ సారి కూడా సినీ నేపథ్య గాయకులు, తారలు పాల్గొంటారని తెలిపారు. ఆవిష్కరణలో యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకనాథ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, అశ్వ్ - 2026 కన్వీనర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమాల్ బాషా,అసిస్టెంట్ డైరెక్టర్-అడ్మిషన్స్ డాక్టర్ వి.మారుతీ ప్రసాద్, కో - కన్వీనర్స్ ప్రదీప్‌కుమార్, లక్ష్మిప్రీతీ, స్టూడెంట్ కో ఆర్డినేటర్స్ ,విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విజయ భాస్కర్ చౌదరి

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం విజిలెన్స్ పోలీస్ దిలీప్ కుమార్ మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని వలసపల్లి, వేంపల్లి ప్రాంతాలలో కరపత్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యే రైతులు, మహిళలు, చిన్నారులు, వాహనదారులు తమ అజాగ్రత్త వల్ల విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాల వల్ల విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, ఎంతోమంది శాశ్వత అంగవైకల్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చిన్నపిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. విద్యుత్ తీగల సమీపంలో గాలిపటాలు ఎగుర వేయకూడదని అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్నారులను విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలకు దూరంగా ఉంచాలన్నారు. ప్రజలు భద్రతా నియమాలను పాటించి, విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా సురక్షతంగా ఉండాలని కోరారు. సమస్యలుంటే సమాచారం ఇవ్వాలని తెలిపారు.



సెల్ టవర్ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

సెల్ టవర్ నిర్మాణంపై ఆందోళన

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని సచివాలయం-3 వద్ద కొత్తగా నిర్మిస్తున్న సెల్ టవర్‌పై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతానికి సమీపంలో టవర్ ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు ప్రమాదంలో పడతారనే భయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల వ్యతిరేకతను గుర్తించిన అధికారులు పోలీసుల సమక్షంలో నిర్మాణ పనులను నిలిపివేశారు. నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని అక్కడి నుంచి తొలగించి పోలీస్ స్టేషన్‌కు తరలించి, అనంతరం కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కార్యక్రమంలో స్థానికులు ఏనుగుల బాలాంజనేయులు, సయ్యద్ అమీర్, ఆదినారాయణ, మాజీ ఎజిపి షేక్ మహమ్మద్ అలీ, ప్యారు, గోపాలకృష్ణ పాల్గొని ప్రజల ఆరోగ్య భద్రతే ప్రధానమని పేర్కొన్నారు. అవసరమైతే గ్రామానికి దూరంగా సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, ప్రజల సమ్మతి లేకుండా ఇలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని వారు స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వైఎస్ఆర్‌టియుసి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఇటీవల వైఎస్ఆర్ టియుసి పట్టణ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం తమ ఎంపికకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ట్రేడ్ యూనియన్ బలోపేతానికి, మండలంలో వైసిపిని బలోపేతం చేయడానికి కృషి చేయాలని నూతన కమిటీకి సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనలు, సలహాలు మేరకు పనిచేస్తామని, ట్రేడ్ యూనియన్ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు. తమ ఎంపికకు అన్నివిధాల సహకరించిన వైసిపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు, బి.కొత్తకోట మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్‌అహ్మద్‌నుసైతం ఘనంగా సన్మానించారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృత పరచడమే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు లయన్స్ క్లబ్ ప్లాటినం సేవలను మరింత విస్తృత పరచడమే లక్ష్యమని ఆ శాఖ అధ్యక్షులు గ్యారంపల్లె రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. పట్టణంలోని గొర్రెలు, మేకలు వ్యాపారులు, రైతులకు సౌకర్యంగా భోజన వితరణ కార్యక్రమాన్ని చేశామన్నారు. సోమవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోనూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్లాటినం కార్యదర్శి సోమిశెట్టి సురేష్ బాబు, ట్రెజరర్ శివగణేష్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ సంజీవరెడ్డి, జోనల్ చైర్ పర్సన్ బలస వేణుగోపాల్. సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, సురేంద్రనాథరెడ్డి, బాలాజి, ప్రసాద్, హరీష్ బాబు పాల్గొన్నారు.

వాల్మీకుల సమస్యలను పరిష్కరించాలి

-ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :వాల్మీకుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కు వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరి బాబు వినతిపత్రం అందజేశారు. శ్రీ బోయకొండ గంగమ్మ దర్శనార్థం ఆలయానికి వచ్చిన ఎంపీకి రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ నాయకులు ఘనస్వాగతం పలికారు. దుశ్శాలువతో సన్మానించి, పూల బోకేలు అందించి, పూలమాలలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి చిరకాల ఆకాంక్షలు నెరవేర్చ డానికి పార్లమెంటు సభ్యులుగా మీవంతు కృషి చేయాలని అభ్యర్థించారు. వాల్మీ కుల దశాబ్దాల కోరిక అయినటువంటి ఎస్‌టి జాబితా పున రుద్ధణ అంశాన్ని పార్ల మెంటులో ప్రస్తావించాలన్నారు. వాల్మీకులకు అన్నివిధాలా అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయనతోపాటు శ్రీబోయకొండ గంగమ్మ దర్శనానికి వెళ్ళారు. కార్యక్రమంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మసమాజ్ అధ్యక్షులు మేకల విజయ్ మోహన్, గంపల గంగరాజు, టైలర్ శీన, హరి, రమణ పాల్గొన్నారు.



ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ఉపాధ్యాయులు

'శ్రీచైతన్య'లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి-రాయచోటి : స్థానిక శ్రీ చైతన్య రెసిడెన్షియల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు.ఉమ్మడి కడపజిల్లా డివిజన్ ఎజిఎండి రమణయ్య సిబ్బందికి, విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆదేశాలననుసరించి నిర్వహిం చిన వేడుకలను ప్రాంతీయసంచాలకులు పి.మహబూబ్‌బాషా ప్రారంభించారు. సాంప్రదాయం ప్రకారం కొత్త కుండలో పాలుపొంగించి భోగి మంటవేశారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధార ణలతో బాటు రైతు లవేషధారణలతో పాఠశాలప్రాంగ ణమంతా, పూరిపాక, పచ్చని తోరణాలు, కోడిపందాలు రంగ వల్లులతో పల్లెటూరివాతావరణం నెలకొంది. భోగిమంట అనంతరం ప్రిన్సిపల్ కళాభారతి వైస్ ప్రిన్సిపల్స్ జీవానందం, సెలీనా, సను, ఉపా ధ్యాయులు విద్యార్థుల తలపై భోగిపళ్ల దోసిట్లతో పోసి ఉత్తమ విద్యా బుద్ధులు సిద్ధిరస్తు అంటూదీవించారు. అనంతరం పిల్లలతో కలిసి గాలిపటాలను ఎగురవేశారు. అంతకు ముందు పిల్లలను ద్దేశించి మహబూ బ్‌బాషా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిపల్లెటూరులో మూడురో జులపాటు అత్యంత వైభవంగా జరుపుకునే మొట్ట మొదటిపండుగ సంక్రాంతిని భోగి, కనుమ, సంక్రాంతి పేరుతో ప్రతి ఏడాది జనవరిలో జరుపు కుంటాం న్నారు. రైతులు తాము కష్టపడి పండించిన పంటను ఇంటికి తెచ్చుకుని తమనేస్తాలైన ఎడ్లను అందంగా అలంకరిస్తారని పండగ విశిష్టతను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో ఇన్చార్జులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వరప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి బస్సు ఢీకొని బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని కురబలకోట మండలం, పిచ్చిలవాండ్లపల్లెకు చెందిన మాధవ కుటుంబం మదనపల్లె సిటిఎం రోడ్డులోని టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటోంది. మాధవ కుమారుడు రెడ్డిగణేష్ టిడ్కో ఇళ్ల నుంచి ద్విచక్రవాహనంలో మదనపల్లె పట్టణంలోకి బయల్దేరాడు. మార్గ మధ్యం లోని తట్టివారిపల్లి చెరువు కట్టపై ఆర్‌టిసి బస్సు మదనపల్లె వైపు వెళుతుండగా దాని వెనుకే వెళ్తున్న కారు బస్సును అధిగమించింది. కారు వెనుకే వెళ్తున్న రెడ్డిగణేష్ బస్సును అధిగమిస్తుండగా బస్సు డ్రైవర్ గమనించు కోకుండా రెడ్డిగణేష్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బాలుడి కాలు విరిగి తీవ్రంగా గాయ పడ్డాడు. స్థానికులు గమనించి బాదితుడిని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై తాలూకా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.